సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 1 । జూన్ । 2025



యోగాతో ఆరోగ్యానికి రక్ష

నిత్యం యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. సౌమ్యనాథస్వామి ఆలయం ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహించారు. -8లో



మీ సేవలు చిరస్మరణీయం

విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటూ సమాజానికి మీరు చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.88	రూ.109
రెండోరకం	రూ.62	రూ.84



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1750 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	520	520
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 125.880 కిలోలు

న్యూస్‌రీల్

కోవిడ్‌పై ప్రజలు ఆందోళన చెందవద్దు: ఉషశ్రీ

రాయచోటి: కోవిడ్-19పై జిల్లా ప్రజలు ఆందోళన చెందవద్దని, దానిని ఎదుర్కోవడానికి అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉన్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఉషశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లికు చెందిన నాగేంద్ర (27)కు కోవిడ్ పాజిటివ్‌గా తేలిందని చెబుతూ వాట్సప్‌లో సర్క్యులేట్ అవుతున్న మెసేజ్‌పై స్పందించిన ఉషశ్రీ నాగేంద్రకు ఆర్టీపీసీఆర్ టెస్టింగ్ తరువాతే కోవిడ్ నిర్ధారణ చేయగలుగుతామన్నారు.దీనిపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దని తెలిపారు.

వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆచార్య శ్రీనివాస్

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ నియమితులయ్యారు. విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాస రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల పత్రాలను ఆచార్య శ్రీనివాస రావు, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ.. శ్రీనివాస్‌కు అందజేశారు. ప్రిన్సిపల్ పోస్టుతోపాటూ కడపలోని వై.వి.యు. హాస్టళ్ల చీఫ్ వార్డెన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇదివరకు ప్రిన్సిపల్ , వసతిగృహాల చీఫ్ వార్డెన్‌గా పనిచేసిన ఆచార్య ఎస్ రఘునాథ్ రెడ్డి పదవీకాలం పూర్తి కావడంతో ఆ బాధ్యతల నుంచి ఆయన రిలీవ్ అయ్యారు.

మార్కెట్లకు వరదలా టమాట



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమాట

బి.కొత్తకోట: ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులకు టమాట వరదలా వచ్చి పడుతున్నాయి. ధరల్లో పెరుగుదల లేనప్పటికి పంట దిగుబడులు భారీగా వస్తున్నాయి. దీంతో శనివారం ఒకరోజే 5,480 టన్నులు విక్రయానికి వచ్చాయి. మదనపల్లె మార్కెట్‌కు 1,750 టన్నులు, వి.కోట మార్కెట్‌కు 132, పలమనేరు మార్కెట్‌కు 460, పుంగనూరు మార్కెట్‌కు 1,568, ములకలచెరువు మార్కెట్‌కు 1,580, బి.కొత్తకోట మార్కెట్‌కు 25 , అంగళ్లు మార్కెట్‌కు 40 టన్నులు వచ్చాయి. కాగా ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లెలో కిలో టమాట రూ.6.20 పైసలు, వి.కోటలో కిలో రూ.7, పలమనేరులో కిలో రూ.7.50 పైసలు, పుంగనూరులో కిలో రూ.6.70పైసలు, ములకలచెరువులో కిలో రూ.8.50 పైసలు పలికింది.

2న డీఈఈ సెట్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ కడప జిల్లాలో డీఈఈ సెట్-2025 (కంప్యూటర్ బేస్డ్ టెస్టు) పరీక్ష జూన్ 2వ తేదీ 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నామని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. సంబంధిత పరీక్ష మూడు సెంటర్లలో నిర్వహించనున్నామని తెలిపారు. డీఈఈ సెట్-25 అభ్యర్థులు హాల్ టికెట్లను https://apdeecet.apcfss.in/ వెబ్ సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. నామినల్ రోల్స్‌లో పేరు, పుట్టిన తేదీ, లింగం వంటి ఏవైనా సవరణలు ఉంటే పరీక్షా కేంద్రంలో సరిదిద్దుకోవచ్చన్నారు. హాల్ టికెట్‌తో పాటు అభ్యర్థులు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు(ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, ఓటర్ కార్డు) తమ వెంట పరీక్ష హాల్‌కు తీసుకొని రావాలని తెలిపారు. అభ్యర్థులు వారికి సంబంధిత పరీక్ష తేదీ, సెంటర్‌ను సరిచూసుకుని నిర్ణీత సమయంకంటే అరగంట ముందే పరీక్ష సెంటర్‌కు హాజరుకావాలని డీఈఓ తెలిపారు.

బాలల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా చర్యలు చేపట్టాలి

రాయచోటి: బాలలు, కౌమార కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ, పునరావాస ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో దేశవ్యాప్తంగా జూన్ 1 నుంచి చేపట్టనున్న బాలల, కమార దశ పిల్లల సంరక్షణ, పునరావాస ప్రచార కార్యక్రమంపై కార్మిక, పోలీసు, విద్య, వైద్య తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్మికశాఖ జిల్లా అధికారి రంగరాజు జిల్లాలో జరగబోయే బాలల సంరక్షణ, పునరావాస ప్రచార కార్యక్రమాలు గురించి పలు విషయాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంరక్షణ, వారి పునరావాసమే ధ్యేయంగా జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ పనిచేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ ఆధ్వర్యంలో బాల, కౌమార కార్మిక వ్యవస్థ చట్టం 1986, సవరణ చట్టం 2016పై రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎన్జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుకు భరోసా కరువు


- ఏడాది అవుతున్నా నయా పైసా విదల్చని సర్కార్
- వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి ఏడాది మే నెలలో పెట్టుబడి సాయం
- ఈ ఏడాది ఖరీఫ్ పెట్టుబడికి రైతన్నల ఎదురుచూపు



సాక్షి రాయచోటి: ఎన్నెన్నో హామీలు...మరెన్నో ఆశలు పెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ అములులో అలక్ష్యం చేస్తోంది. గత ఖరీఫ్, రబీలో పంటలు వర్షాభావంతో ఎండిపోయి కరువు పరిస్థితుల్లో చిక్కి విలవిల్లాడిపోతున్న అన్నదాతను ఆదుకోవడంలో ఇప్పటికీ కూటమి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తోంది. అన్నదాత సుఖీభవ అందిచడంలో శ్రద్ధ కనిపించడం లేదు.

ఎన్నికలకు ముందు అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పినా ఇప్పటికీ చిల్లిగవ్వ ఇవ్వలేదు. ప్రభుత్వ పగ్గాలు చంద్రబాబు చేపట్టి దాదాపు ఏడాది కావస్తున్నా పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతన్న ఖరీఫ్ ఆశలపై నీలి నీడలు అలుముకున్నాయి. గతంతో వైఎస్సార్ సీపీ సర్కార్ వ్యవసాయాన్ని పండుగ చేసి చూపించింది. ఉచిత పంటల బీమా పథకంతోపాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించడం, ప్రతి ఏడాది కరువు బారిన పడిన రైతులను ఆదుకోవడం, ఖరీఫ్‌కుముందే వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తూ రైతులను వ్యవసాయ పరంగా ఆదుకుంది.

అన్నదాత సుఖీభవకు ఎదురుచూపులు



కూటమి సర్కార్ రైతన్నకు ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో అన్నదాతలు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు. ఎప్పుడు అమలు చేస్తారో తెలియక ఆందోళన చెందుతున్నారు. గతంలో మే నెలలో రైతు భరోసా సొమ్ములు తీసుకుని పంట సాగుకు వినియోగించుకునేవారు. అయితే ఇప్పటి కూటమి సర్కార్ ఇంతవరకు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో రైతన్నలు పంటల సాగుపై ఆలోచనలో పడ్డారు. అయితే ఇప్పటికీ కూడా ఒకే విడతలో అన్నదాత సుఖీభవకు సంబంధించి చెప్పిన ప్రకారం రూ. 20 వేలు వేస్తారా? లేక ఎన్ని విడతల్లో వేస్తారో అన్నది కూడా తెలియని పరిస్థితి నెలకొంది. అంతేకాదు...కుటుంబంలో ఒకరికే ఇస్తారన్న ప్రచారంతో రైతన్నలు కృంగిపోతున్నారు. మరోవైపు జూన్ నుంచి ఖరీఫ్ సాగు మొదలు కానున్న తరుణంలో ప్రభుత్వం అన్నదాత సుఖీభవపై స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళన కలిగించే పరిణామం.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.1360 కోట్ల పెట్టుబడి సాయం

2019లో అధికారంలోకి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ రావడం....వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుంచి రైతుల బాగు కోసం అనేక పథకాలు అమలు చేయాలని సంకల్పించారు. అందులో భాగంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి పల్లె ముంగిటకే అధికారుల సేవలను తీసుక రావడం ద్వారా చరిత్ర సృష్టించారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ప్రతి ఏడాది మే నెలలోనే నిధులు విడుదల చేసేవారు. ఎందుకంటే ఖరీఫ్‌లో పంట సాగు మొదలు పెట్టే రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్న ఆశయంతో వైఎస్ జగన్ సర్కార్ పెట్టుబడి సాయం కింద నిధులు విడుదల చేస్తూ వచ్చింది. అన్నమయ్య జిల్లాలో సుమారు 2.20 లక్షల నుంచి 2.30 లక్షల మంది రైతులకు ఐదేళ్లలో రూ. 1360 కోట్లకు పైగా సాయం అందించింది. కేంద్రసాయంతో కలుపుకుని వైఎస్సార్ సీపీ సర్కార్ వైఎస్సార్ రైతు భరోసా కింద భారీ ఎత్తున నిధులు అందిస్తూ వ్యవసాయ పండుగ చేసింది. రైతు భరోసాతోపాటు సున్నా వడ్డీ పథకం ద్వారా రైతులపై భారం పడకుండా బ్యాంకులకు ప్రభుత్వమే చెల్లించింది.



వైఎస్ జగన్ హయాంలో రైతులకు అందిన సాయం (రూ. కోట్లలో)

ఏడాది	రైతుల సంఖ్య	రైతు భరోసా మొత్తం	పీఎం కిసాన్ మొత్తం
2019-20	196010	147.00	117.69
2020-21	205716	154.28	123.42
2021-22	204133	153.09	122.47
2022-23	198957	149.21	119.37
2023-24	203374	152.53	122.02

రైతులపై కూటమి సర్కార్ కపట ప్రేమ



రైతులపట్ల కూటమి ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోంది.ఎన్నికలకు ముందు అన్నదాతకు అండగా ఉంటామని చెప్పింది.అధికారంలోకి వచ్చాక మాట నిలబెట్టుకోవడంలో విఫలమైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతోంది. విత్తనకాయలు కొనుగోలు చేయాలి.దుక్కులు చేసుకోవాలి.ఇందుకోసం అప్పు చేయాల్సి వస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామిని నిలబెట్టుకుని ప్రతి ఏడాది రైతుకు రూ.13,500లు అందజేశారు. కూటమి ప్రభుత్వం రైతులపట్ల నిర్లక్ష్యం చేస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేయాలి.

–సుబ్బరాయుడు, రైతు, సంబేపల్లె మండలం

ఏదాడి అవుతున్నా..



గతంలో ఏటా 13,500 చొప్పున మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి. ఈ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ఏడాది అవుతున్నా ఇస్తామన్న రూ. 20 వేలలో నయాపైసా వేయలేదు. ఖరీఫ్ సాగుకు విత్తనాలు, ఎరువులు, దుక్కుల కోసం డబ్బులు లేక అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసి నష్టపోయినా పంట నష్టం కూడా ఇప్పటికీ అందలేదు.తక్షణమే పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

–మట్లి రెడ్డయ్య, వడ్డిపల్లి, కుర్నూతల గ్రామం, లక్కిరెడ్డిపల్లి మండలం

అన్నదాత సుఖీభవ ఏదీ?



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని హామి ఇచ్చింది. అయితే ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా పథకం అమలు చేయలేదు. ఈ ఏడాదైనా పెట్టుబడి సహాయం కింద సుఖీభవ పథకం అమలు చేస్తే రైతులకు ఎంతో మేలు చేసిన వారవుతారు. పంటల సాగుకు చేతిలో చిల్లిగవ్వ లేదు. పంటలు ఎలా సాగు చేయాలో దిక్కు తోచడం లేదు. – చిన్న వెంకట రమణారెడ్డి, రైతు, గోపనపల్లె గ్రామం, గాలివీడు మండలం

రైతులకు సాగు కష్టాలు



రైతులకు మళ్లీ సాగు కష్టాలు దాపురించాయి. ఏడాది అవుతున్నా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేల పెట్టుబడి సాయం ఇప్పటివరకు ఇవ్వలేదు. ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీ ఎప్పుడు అమలవుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. స్పష్టంగా ఇంత వరకు ఈ పథకానికి సంబంధించి తేదీని ప్రకటించలేదు. కేంద్ర ప్రభుత్వం మాత్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద యధావిధిగా రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతోంది.

–సానుగారి విశ్వనాథ రెడ్డి, ఓబులవారిపల్లి

పథకాలకు పేరు మార్చి ప్రజలకు

వెన్నుపోటు పొడిచారు



వెన్నుపోటు దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కె.సురేష్‌బాబు, అమరనాథరెడ్డి, ద్వారకనాథరెడ్డి, నిస్సార్‌అహమ్మద్

- జూన్ 4 వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి
- జిల్లా పరిశీలకులు, కడప మేయర్ సురేష్‌బాబు

రాయచోటి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలకు పేర్లు మార్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ పరిశీలకులు, కడప మేయర్ సురేష్‌బాబు విమర్శించారు. శనివారం రాయచోటిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వెన్నుపోటు దినోత్సవం పోస్టర్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న వెన్నుపోటు దినోత్సవంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడప మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలనపై మండిపడ్డారు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్న విషయం 15 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు తెలియదా అని నిలదీశారు. సంపద సృష్టిస్తాను.. సూపర్ సిక్స్ అమలు చేస్తానని ప్రజలను మోసం చేశారన్నారు. కేవలం పెన్షన్ మాత్రం రూ.4 వేలు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో 65 లక్షల పెన్షన్లు ఇస్తే నేడు కూటమి ప్రభుత్వంలో 57 లక్షల మందికి అందుతున్నాయన్నారు. ఇందులో 7 లక్షల పింఛన్లు తగ్గించడం వాస్తవం కాదా అని అన్నారు. ఏపీ అంటే ఏ అంటే అమరావతి పీ పోలవరాన్ని దోచుకోవడంగా పాలన సాగుతోందన్నారు. సంవత్సరం పాలనలో వైఎస్సార్‌సీపీని టార్గెట్ చేసుకుని రాష్ట్రంలో 99 శాతం ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను బెదిరించడమే పాలనగా కొనసాగిస్తోందన్నారు. నేడు గత ప్రభుత్వం కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని గద్దెనెక్కి కడపలో మహానాడు నిర్వహించి వైఎస్సార్‌సీపీ టార్గెట్‌గా ప్రసంగాలు చేశారన్నారు. హంద్రీనీవాను పూర్తి చేయకుండా బనకచర్లతో సస్యశ్యామలం చేస్తామని కొత్త రాగం అందుకున్నట్లు ఆరోపించారు.

సూపర్ సిక్స్ పేరుతో అన్ని వర్గాలను మోసం చేశారు: ఎమ్మెల్యే ఆకేపాటి

సూపర్ సిక్స్ పేరిట 140 హామీలు ఇచ్చి అందరికీ మంచి చేస్తామని అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను మోసగించారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి విమర్శలు గుప్పించారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తాం స్వీటు బాక్సులు తీసుకురండి అని వారిని కనిపించకుండా చేశారన్నారు. విద్యార్థులకు నీకు 15 నీకు 15 నీకు 15 నీకు 18 అని ఇవ్వకుండానే మోసం చేశారన్నారు.

బాబుకు వెన్నుపోట్లు కొత్త కాదు: ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

చంద్రబాబుకు అబద్ధాలతో ప్రజలను మోసం చేయడం, వెన్నుపోటు పొడవడం కొత్త కాదని తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి విమర్శించారు. నాడు ఎన్టీఆర్, నేడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. గండికోట నుంచి నాలుగు టీఎంసీల నీరు అన్నమయ్య, చిత్తూరు జిల్లాల నియోజకవర్గాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తే దాన్ని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. ఫ్లోరైడ్ వాటర్‌తో ప్రజలు ఇబ్బంది పడుతుంటే రూ.2450 కోట్లతో పైప్‌లైన్ మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. వైఎస్ జగన్ 5 సార్లు కరెంటు చార్జీలు పెంచారు అన్నారు.. ఆయన ఐదు సార్లు పెంచితే చంద్రబాబు ఒకేసారి ఐదు సార్లకు మించి పెంచారన్నారు.

కూటమి పాలన చేసింది శూన్యం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని మదనపల్లి పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నిస్సార్‌అహమ్మద్ ఆరోపించారు. నారా లోకేష్ మదనపల్లె పర్యటనలో టమాటా రైతుల కోసం కోల్డ్ స్టోరేజ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని, కమిషన్లు తగ్గిస్తామని చెప్పిన మాటలు నేటికీ అమలు కాలేదన్నారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి కూడా పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని శాంతినగర్ బ్రిడ్జిపై శనివారం రాత్రి కడప వైపు నుంచి వస్తున్న లారీని తిరుపతికి వెళ్తున్న మ్యాక్స్ వాహనం ఢీ కొనడంతో డ్రైవర్ షీర్ (50) అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి..

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప-కమలాపురం రైలు మార్గంలోని గంగాయపల్లె యార్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తి (50) శనివారం గూడ్స్ రైలు కింద పడి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తు పట్టిన వారు 94409 00811 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి శనివారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడిని (70) తీసుకుని వచ్చారు. అతన్ని పరీక్షించిన డాక్టర్లు చనిపోయాడని నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. అతని వివరాలు తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు సూచించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

– ఇద్దరికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు కొత్త బస్టాండ్ సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ఉన్న హుస్సేన్ పీరా, హరిలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దనూరు రోడ్డులోని జయమ్మ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంలో హుస్సేన్ పీరా, హరిలు వస్తుండగా.. ఆర్టీసీ బస్టాండులోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో వీరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు సిఫార్సు చేశారు.

యువతి అదృశ్యం

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలం కల్లమల్ల పోలీసు స్టేషన్ పరిధిలోని కృష్ణా నగర్ కాలనీకి చెందిన సుస్మిత అనే యువతి అదృశ్యమైనట్లు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కృష్ణానగర్ కాలనీలో నివాసం ఉంటున్న కులాయప్ప కుమార్తె ప్రొద్దుటూరులోని ఎస్ఆర్ఐటీ కాలేజిలో మొదటి సంవత్సరం డిప్లొమో చదువుతోంది. శనివారం తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పచ్చిరొట్టతోనే భూసారం

సేంద్రియ ఎరువుతో భూమికి పోషకాలు


గుర్రంకొండలో సాగు చేసిన పచ్చిరొట్ట విత్తనాల పంట

గుర్రంకొండ : ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో వివిధ రకాల పంటల సాగు చేసే రైతుల కోసం ముందుగా పచ్చిరొట్ట సాగు చేసుకొంటే పొలాలు ఎంతో సారవంతమవుతాయి. తద్వారా భూమిలో భూసారం పెరిగి అధిక పంట దిగుబడులు సాధించవచ్చు. పచ్చిరొట్ట విత్తనాలు ప్రస్తుతం పంపిణీ చేస్తున్నారు. రైతులు వరి, టమాటా, ఇతర కూరగాయల పంటల సాగులో సేంద్రియ ఎరువులను తగు పాళ్లలో భూమికి అందించడంలో పచ్చిరొట్ట ఎంతో ఉపయోగపడుతుంది. మరో 15 రోజుల్లో ఖరీఫ్ పంటల సాగు కోసం రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

పచ్చిరొట్ట ఎరువు వల్ల లాభమేంటంటే..

ఈ రకం ఎరువు వినియోగం వలన భూమి గుల్లబారుతుంది. అలాగే భూసారం కుడా బాగా పెరుగుతుంది. పొలానికి నీటిని, పోషక పదార్థాలను నిల్వ ఉంచుకొనే శక్తి పెరగడంతో మొక్కల వేర్లకు గాలి, నీరు, పోషకాలు పుష్కలంగా అందుతాయి. జనుము, జీలుగలు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను ఎరువుగా తక్కువ ఖర్చుతోనే పెంచుకోవచ్చు. వీటి ద్వారా భూములు మరింత సారవంతమవుతాయి. భూమిలో ఆమ్ల, క్షార గుణాలను పెంపొందిచడం, మొక్కలకు పోషక పదార్థాల లోపాలు రాకుండా చూసుకోవడంతో పాటు పంట నాణ్యత, దిగుబడులు మెరుగుపడేందుకు ఈ రకం విత్తనాలు ఎరువులుగా వేయడం వలన చీడపీడల బెడద తగ్గుతుంది. పంటలో కలుపు మొక్కలను కూడా నివారించవచ్చు. వర్షపు నీటిని వృథాగా పోనీయకుండా భూమిలో ఇంకేలా చేస్తుంది. పంటలకు మేలుచేసే రకాల సూక్ష్మ క్రిములు భూమిలో వృద్ధి పొందేందుకు ఉపయోగపడుతుంది. పప్పు జాతి పచ్చిరొట్ట పైరు వల్ల భూమిలో నత్రజనిని స్థిరీకరించి భూసారం పెంపొందించవచ్చు.

పచ్చిరొట్ట విత్తన ఎరువుల్లో ఎంపిక..

పచ్చిరొట్ట పైరు బాగా పెరిగి, ఆకులు ఎక్కువగా కాండం వచ్చి మొత్తగా ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా వీలైనంత వరకు లెగ్గింగ్ జాతి మొక్కలను పెంచడం వలన పైర్లపైన నత్రజని బుడిపెల ద్వారా గాలిలో నత్రజని స్థిరీకరిస్తాయి. ఇవి త్వరగా కుళ్లిపోయే ప్రభావం కలిగి ఉంటాయి. ఇవి అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉండడంతో పాటు నీటి ఎద్దడి తట్టుకొని పెరుగుతుంది. పచ్చిరొట్ట పైర్ల వేర్లు భూమిలోకి త్వరగా చొచ్చుకొని పోయే గుణం కలిగి ఉంటాయి.

సేంద్రియ కర్బనం లోపం సవరించుకొంటేనే..

సేంద్రియ కర్బనం లేకపోవడం వరి పంటకు శాపంగా మారుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో వస్తున్న మార్పులు పంట అవశేషాల్ని తొలగించడం లేదా కాల్చేయడం, భూమికోతకు గురికావడం సరైన యాజమాన్య పద్ధతులు పాటించక పోవడం ఇవన్నీ సేంద్రియ కర్బన లోపానికి కారణాలే. భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించుకోవడానికి పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు సాగుచేసుకోవడమే ఉత్తమమైన మార్గం.

> **భూసారం పెరుగుతుంది..**
>
> పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవడం వలన పంట పొలాల్లో భూసారం పెరుగుతుంది. సేంద్రియ ఎరువుల గుణం భూమిలో ఎక్కువగా ఉంటుంది. తద్వారా స్వచ్ఛమైన, ఆరోగ్యానికి మేలు చేసే పంట దిగుబడులు సాధించవచ్చు.
>
> 
>
> – వాణిశ్రీ, ఏడీఏ, వాల్మీకిపురం

సేంద్రియ కర్బనం పెంచుకోవడానికి..

జీలుగల సాగు :
పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసుకొంటే భూమికి అవసరమైన సేంద్రియ పదార్థాలను అందిస్తాయి. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల్లో భాగమైన జీలుగలు ఎకరానికి 12 నుంచి 15 కిలోలు వేసుకోవాలి. పూతదశలో కోసినప్పుడు ఎకరానికి 5 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. ఒకటన్ను జీలుగ సాగులో 5 కిలోల నత్రజని,1.5 కిలోల భాస్వరం, 4 కిలోల పొటాష్ వస్తుంది. ఇది చౌడు భూములకు బాగా పనికొస్తుంది.

జనుములు :
ఎకరానికి 20 నుంచి 25 కిలోల విత్తనాలు కావాలి. పూత దశకంటే పంట వేసిన ఎనిమిది వారాల తరువాత కోసినప్పుడు 6 నుంచి 8 టన్నుల పచ్చిరొట్టను ఇస్తుంది. ఒక టన్ను జనుములో 4కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, 3 కిలోల పొటాష్ ఉంటుంది.

పిల్లిపెసెర సాగుతో..
ఎకరానికి 6 నుంచి 8 కిలోల విత్తనం వేసుకోవాలి. పూతదశలో 4 నుంచి 5 టన్నుల పచ్చిరొట్టను ఇస్తుంది. దీన్ని పశుగ్రాసంగా కూడా వాడవచ్చు. ఒకటన్ను పిల్లిపెసెరలో 4కిలోల నత్రజని, కిలో భాస్వరం, 3కిలోల పొటాష్ ఇస్తుంది. ఈ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు చల్లుకోవడం వలన భూముల్లో సేంద్రియ కర్బనం పెంపొంది వాటికి సహజసిద్ధమైన భూసారం వస్తుంది.

అదుపు తప్పి వాహనం బోల్తా

- ఒకరి మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు


మృతి చెందిన జింకా చంద్ర


అదుపుతప్పి బోల్తా పడిన వాహనం

సిద్దవటం : సిద్దవటం గ్రామ శివారులోని ఉషా గార్డెన్ వద్ద శనివారం బొలేరో పికప్ లగేజీ వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో అందులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో జింకా చంద్ర(44) అనే వ్యక్తి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. డప ఉక్కాయపల్లె వైఎస్ఆర్ కాలనీకి చెందిన జింకా చంద్ర కూలి పనిచేసుకొని జీవించేవాడు. ఇతనికి బద్వేలులోని శ్రీకృష్ణ దేవరాయ నగర్‌లో 5 సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తారని, స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటుకు శనివారం కడప నుంచి సిమెంటు ప్లేట్లు, స్తంభాలు తీసుకొని కూలీలతో బొలెరో పికప్ లగేజి వాహనంలో బద్వేల్‌లుకు బయలుదేరాడు. వాహనం సిద్దవటం గ్రామ శివారులోని ఉషా గార్డెన్ వద్దకు రాగానే ఎదురుగా ఎద్దు రావడంతో దాన్ని తప్పించబోయి అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జింకా చంద్రకు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు అబ్దుల్‌బార్, ఆర్‌బాజ్, అఫ్సర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అయితే జింకా చంద్ర చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లోతైన దుక్కులతో ఎంతో మేలు

కడప అగ్రికల్చర్ : రుతుపవనాల ఆగమనంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయని, రైతులందరూ లోతైన దుక్కులు చేసుకోవాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా చింతకొమ్మదిన్నె మండలం నాగిరెడ్డిపల్లె గ్రామంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేసే పంటలకు సంబంధించి విత్తన ఎంపిక ఎంతో ముఖ్యమన్నారు. పంటల సాగుకు ముందు కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. భారత నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మంగేష్ దుబే మాట్లాడుతూ ఖరీఫ్ పంటల సాగుకు ముందు రైతులు అధికారుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి.విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో నేల సమతుల్యతను కాపాడే విధంగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. ప్రొద్దుటూరు పశు వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులు, టీకాలు, అలాగే గొర్రెలు, మేకల పెంపకంలో జాగ్రత్తల గురించి వివరించారు. ఉద్యానశాఖ టెక్నికల్ అధికారి జ్యోతిర్మయి ఉద్యాన రంగంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కే.సాయి మహేశ్వరి, డాక్టర్ సురేష్ కుమార్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శైలజ, మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్ రెడ్డి, సిబ్బంది తరుణ్, చంద్రారెడ్డి, ఆత్మ ఏటీఎం రైతులు పాల్గొన్నారు.

దళిత మహిళలపై దాడులను అరికట్టాలి

ప్రొద్దుటూరు : దళిత మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, దాడులను అరికట్టాలని రాష్ట్ర మాలమహానాడు కమిటీ జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ తెలిపారు. శనివారం స్థానిక పాత బస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర మాలమహానాడు నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై అధికారుల వేధింపులు, దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రతి నెల ఆర్డీఓ సమక్షంలో దళిత వాడల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

యోగాతో ఆరోగ్యానికి రక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్


యోగాసనాలలో పాల్గొన్న ప్రజలు

నందలూరు : నిత్యం యోగా సాధన వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. యోగాంధ్ర 2025 జిల్లా స్థాయి కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన సౌమ్యనాథస్వామి ఆలయం ఆవరణలో శనివారం కలెక్టర్ ఆధ్వర్యంలో వేయి మందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరి ఆరోగ్య ఆంధ్ర సాధ్యమవుతుందన్నారు. రాజంపేట హైదర్‌నగర్‌కు చెందిన న్యాయ శాస్త్రం రెండో సంవత్సరం విద్యార్థిని ఆర్‌ఏఈ మహిద్య వేసిన యోగాసనాలు అందరినీ అబ్బురపరిచాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎంపీడీఓ రాధాకృష్ణంరాజు, డీఎఫ్ఓ జగన్నాథ్‌సింగ్, సబ్ డీఎఫ్ఓ సుబ్బరాజు, జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం, డ్వామా పీడీ వెంకటరత్నం, జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్, విద్యుత్ శాఖ ఎస్ఈలు దయాకర్‌రెడ్డి, సహదేవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, డీఎంహెచ్ఓ ఉషశ్రీ, డీఎస్‌డీఓ గౌస్‌బాషా, పశుసంవర్ధక శాఖ అధికారి, మండల స్పెషల్ అధికారి గుణశేఖర్‌పిళ్లై, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఈఓపీఆర్‌డీ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ తనిఖీ

రాజంపేట : రాజంపేట మండలం తాళ్లపాకలో పింఛన్ల పంపిణీ తీరుతెన్నులను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ శనివారం తనిఖీ చేశారు. లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. నేరుగా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేస్తున్నారా అని లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పంపిణీ సందర్భంగా ఎవరైనా డబ్బు అడుగుతున్నారా అని ఆరా తీశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పీరుమున్నీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

7న అన్నమయ్య ఉద్యాన వనంలో యోగా

ఈనెల 7న అన్నమయ్య ఉద్యానవనం(అన్నమయ్య 108 అడుగుల విగ్రహం)లో యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అన్నమయ్య సంకీర్తనలు పాడే వారిని కూడా యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పీర్‌మున్నీ, ఎంపీడీఓ వరప్రసాద్ ఉన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగర శివార్లలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే 31 నుంచి జూన్ 19 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 4వ తరగతిలో మొత్తం 40 సీట్లకు బాలురు-20, బాలికలు-20, 5 వ తరగతిలో మొత్తం 40 సీట్లకు బాలురు-20, బాలికలు -20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

3 కేజీల గంజాయి స్వాధీనం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో గంజాయి కలిగి ఉన్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కడప పాత బస్టాండులోని రవీంద్రనగర్ బ్రిడ్జి వద్ద గంజాయి కలిగి ఉన్నారన్న సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించామన్నారు. పఠాన్ బిలాల్ అహ్మద్, సయ్యద్ మహబూబ్ బాషా, షేక్ అర్షద్, సయ్యద్ మహమ్మద్ ఉమర్, షేక్ మహ్మద్ రఫీ అనే ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి మూడు కేజీల గంజాయితో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. ఈ ఐదుగురిలో ఒక్కొక్కరిపై ఒడిస్సా రాష్ట్రం, కడప వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటికే పలు గంజాయి కేసులు ఉన్నాయన్నారు. ప్రధాన నిందితుడిగా ఉన్న పఠాన్ బిలాల్ అహ్మద్ భవన నిర్మాణ కూలీగా, సయ్యద్ మహబూబ్ బాషా, షేక్ అర్షద్ టీ హోటల్‌లో మాస్టర్‌గా, సయ్యద్ మహ్మద్ ఉమర్ ఏసీ మెకానిక్‌గా, షేక్ మహ్మద్ రఫీ వస్త్ర దుకాణంలో పని చేస్తూ గంజాయి విక్రయాలు సాగిస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐలు టి. మహేంద్ర, నరసింహారావు, సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాస్త్రంపై అవగాహనతోనే విజయాలు

కడప కల్చరల్ : విద్యా శాస్త్రంపై అవగాహనతోనే మానవాళికి విజయాలు దక్కగలవని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు రవీంద్ర అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 15 రోజులుగా జరుగుతున్న వేసవి వినోదం శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలల భవిష్యత్తు సమాజ అవసరాలతో ముడిపడి ఉందన్నారు. సాంకేతిక, సాంస్కృతిక అవసరాల రీత్యా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, పరిశీలనాత్మక శక్తులను పెంచడంలో తోడ్పడగలవన్నారు. విజ్ఞానాన్ని సరదాగా ఎలా నేర్చుకోవచ్చో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజాద్ అలీ తెలిపారు. శిబిరంలో విద్యార్థులకు పలు శాస్త్రీయ ప్రయోగాలు, చిత్రలేఖనం, పాటలు, మ్యాజిక్, ఓరిగామి తదితర అంశాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్లు, ఐద్వా జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బమ్మ, రిసోర్స్ పర్సన్స్ ప్రసాద్ రెడ్డి, శిరీష, రంగనాయకులు, కామేశ్వరమ్మ, గఫూర్, సమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

– అదనపు కట్నం వేధింపులే కారణం


మృతి చెందిన భాగ్యలక్ష్మి

ధర్మవరం అర్బన్ : అదనపు కట్నం కోసం అత్తింటివారు పెడుతున్న వేధింపులు భరించలేక వివాహిత తన పుట్టింటిలో ఆత్మహత్య చేసుకుంది. ధర్మవరం టూటౌన్ సీఐ రెడ్డప్ప వివరాల మేరకు... వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లి మండలానికి చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ చిన్న నరసింహులుకు ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి(31)తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పెళ్లయిన కొంతకాలం తర్వాత నుంచి అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తమామలు సుబ్బమ్మ, పెద్ద నరసింహులు వేధించడం మొదలు పెట్టారు. పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు కూడా చేశారు. అయినా మెట్టినింటి వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో భాగ్యలక్ష్మి 20 రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. మనోవేదనకు గురైన భాగ్యలక్ష్మి శనివారం ఇంట్లోనే ఉరివేసుకుంది. మృతురాలి తల్లి కొండమ్మ ఫిర్యాదు మేరకు మెట్టినింటి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

చెత్తకుప్పలో ప్రభుత్వ వైద్యశాల మందులు



చెత్తకుప్పలో ప్రభుత్వ వైద్యశాల మందులు, 2026 సంవత్సరం వరకు సమయం ఉన్న మందులు

నందలూరు : నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం సమీపంలోని చెత్తకుప్పలో ప్రభుత్వ వైద్యశాలకు సంబంధించిన మాత్రలు శనివారం దర్శనమిచ్చాయి. ఇందులో కాలం చెల్లిన మాత్రలతో పాటు 2026 సంవత్సరం వరకు సమయం ఉన్న మాత్రలు కూడా ఉన్నాయి. రోగులకు అందాల్సిన మాత్రలు చెత్తకుప్పల పాలు కావడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ సంఘటనపై ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ శరత్‌కమల్‌ని వివరణ కోరగా పీహెచ్‌సీలో గత మూడేళ్ల నుంచి ఉన్న స్టాక్‌ను పరిశీలించామని, అవి తమ పీహెచ్‌సీకి సంబంధించినవి కాదన్నారు. నందలూరు, నాగిరెడ్డిపల్లెకు సంబంధించిన సిబ్బందిని విచారించగా ఆ మందులు తమవి కాదని స్పష్టం చేశారన్నారు.

మీ సేవలు చిరస్మరణీయం


పదవీ విరమణ పొందిన పోలీసు ఉద్యోగులను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటూ సమాజానికి మీరు చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. రాయచోటిలోని అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులు, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను ఘనంగా సన్మానించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు స్థానిక పోలీసు సమావేశ మందిరంలో వారి కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో జిల్లా అదనపు ఎస్పీ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఎ. సుబ్రమణ్యం, జిల్లా స్పెషల్ బ్రాంచ్, ఏఎస్ఐలు నారాయణరాజు, ఎస్.ఉమర్ అలీ, జిల్లా పోలీసు కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఎండీ హేమలతలు పదవీ విరమణ పొందిన వారిలో ఉన్నారు. ఉద్యోగంలో చేరి సుదీర్ఘ కాలం సమాజానికి సేవ చేసి ఉద్యోగంలో మంచిపేరు ప్రతిష్ఠలు తెచ్చారని ఏఎస్పీ కొనియాడారు. తమకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికి సత్కరించడం తమ జీవితంలో ఎన్నటికీ మరువలేమని జిల్లా అదనపు ఎస్పీకి పదవీ విరమణ పొందిన వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, ఏఏఓ జె.త్రినాథ్ సత్యం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి.రాజా రమేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఎస్ఐలు ఆర్‌ఎస్ఐలు, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.